తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు

ఎమ్మెల్యే పద్మారావుగౌడ్‌కు నిధుల దరఖాస్తు ఫారం అందజేస్తున్న మెట్టుగూడ కార్పొరేటర్ సునీతారమేశ్

అడ్డగుట్ట, జూన్ 22 : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. బోనాల నేపథ్యంలో మెట్టుగూడ డివిజన్‌కు సంబంధించిన ఆలయాలకు నిధుల మంజూరు కోసం దరఖాస్తుఫారాలను కార్పొరేటర్ రాసూరి సునీతారమేశ్ శనివారం ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బోనాల పండుగను ప్రశాంతంగా జరుపుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, నాయకులు పాల్గొన్నారు.

షాబాద్‌గూడలో కార్పొరేటర్ పర్యటన

షాబాద్‌గూడలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్,జూన్22: షాబాద్ గూడలో ప్రజాసమస్యలను వెంటనే పరిష్కరిస్తామని సీతాఫల్‌మండి డివిజన్ కార్పొరేటర్ హేమ అన్నారు. శనివారం సాయంత్రం మహ్మద్‌గూడ, షాబాదగూడలో కార్పొరేటర్ హేమ పర్యటించారు. స్థానికులు తాగునీరు కలుషితమవుతుందని ఫిర్యాదు చేశారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను త్వరగా పరిష్కరిస్తానని కార్పొరేటర్ పేర్కొన్నారు ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ ప్రియాంక ,బీఆర్ఎస్ నాయకులు జాకీర్, కాంగ్రెస్ నాయకులు వహీద్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

- సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్, జూన్ 22 : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ సికింద్రాబాద్ నియోజకవర్గ నేత గరికపోగుల చంద్రశేఖర్, మైనారిటీ నేత మహమ్మద్ ఇషాక్ వారసిగూడ చౌరస్తాలో 'హరితహారం' పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలుష్య నివారణకు మొక్కల పెంపకమే శరణ్యమని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు శైలజ, హేమ, నాయకులు నారాయణ, రాజాసుందర్, బెజ్జంకి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వారాసిగూడ చౌరస్తాలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, తదితరులు

హమాలీ బస్తీవాసుల ఇండ్ల సమస్యను పరిష్కరిస్తా.. : ఎమ్మెల్యే

హమాలీ బస్తీలో లబ్ధిదారులకు ఇండ్ల కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. హమాలీ బస్తీ ఫేజ్-1 వాసులు శనివారం సీతాఫల్ మండిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేతో సమావేశమయ్యారు. సుమారు 60 మంది లబ్ధిదారులకు అప్పటి జేఎన్ఎన్npఆర్ఎం హౌసింగ్ స్కీమ్‌లో ఇండ్ల కేటాయింపు జరిగినప్పటికీ, ఇండ్లను వారికి అందించలేదు. దాంతో లబ్ధిదారులు ఎమ్మెల్యేను కలిశారు. తగిన న్యాయం చేస్తామని, ఇల్ల కేటాయింపు త్వరగా పూర్తి చేసేలా త్వరలో అధికారులను సంప్రదిస్తామని ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ పేర్కొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబసభ్యులకు బీమా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

కార్యకర్తలకు అండగా ఉంటాం..

అడ్డగుట్ట : కార్యకర్తలకు బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. అడ్డగుట్ట ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంజయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దాంతో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ బీఆర్ఎస్ కేంద్ర కార్యాలయాన్ని సంప్రదించి అంజయ్య కుటుంబసభ్యులకు పార్టీ బీమా డబ్బులు వచ్చేలా కృషి చేశారు. శనివారం సీతాఫల్‌మండిలోని తన కార్యాలయంలో అంజయ్యకు మంజూరైన రూ. 2 లక్షల పార్టీ ప్రమాద బీమా చెక్కును ఆయన సతీమణి సుజాత, కుటుంబసభ్యులకు అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నదన్నారు. సికింద్రాబాద్‌లో కార్యకర్తల నుంచి పెద్ద ఎత్తున ఆదరణ లభిస్తున్నదని, వారికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీశ్రీనివాస్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, మధు, రవి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నది..

- కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న మేకల సారంగపాణి, తదితరులు

అడ్డగుట్ట, జూన్ 22 : అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ అడగడుగునా ప్రజలను మోసం చేస్తున్నదని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శనివారం మెట్టుగూడ విజయపురికాలనీలోని మర్రి కృష్ణారెడ్డి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బీజేపీ సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కోఆర్డినేటర్లు, అధ్యక్షుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కేంద్రమంత్రిగా మొదటిసారి మెట్టుగూడకు వచ్చిన కిషన్‌రెడ్డికి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగాపాణి కిషన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేశారు. అనంతరం కిషన్‌రెడ్డి మట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సుపరిపాలనను అందించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు శ్యామ్‌సుందర్, నాగేశ్వర్‌రెడ్డి, సీహెచ్ కన్నాభిరాం, ఇంద్రన్న, ఉదయ్‌కుమార్, సాయిబాబాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన గంగపుత్ర సంఘం నాయకులు

సికింద్రాబాద్ : కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి మొదటి సారి నగరానికి విచ్చేసిన జీ. కిషన్‌రెడ్డికి పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. సికింద్రాబాద్ జిల్లా ఫిషరీస్ కన్వీనర్ మూట గణేశ్,నీలి శ్రీనివాస్, ఆంజనేయులు, వెంపటి భాస్కర్,కంటే నాగరాజు,రాజు, అశోక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు చెప్పి శాలువాతో ఘనంగా సత్కరించారు.

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న గంగపుత్ర సంఘం నాయకులు

బాలికలకు భరోసా.. సుకన్య సమృద్ధి యోజన ఖాతా

- వందమంది బాలికలకు ఖాతాలను తెరిచిన యూపీఎస్సీ ర్యాంకర్లు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: బాలికల భవిష్యత్‌కు సుకన్య సమృద్ధి యోజన పథకం భరోసా ఇస్తున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. పేద బాలికలకు చేయూతనందించేందుకు భారత తపాలాశాఖ 'స్ఫూర్తి' కార్యక్రమాన్ని చేపట్టింది. శనివారం ఉస్మానియా యూనివర్సిటీలోని జామై ఉస్మానియా పోస్టాఫీస్‌లో పోస్ట్ మాస్టర్ జనరల్ టీఎం శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 64 మంది యూపీఎస్సీ-24 ర్యాంకర్లు పాల్గొని వంద మంది బాలికలకు సుకన్య సమృద్ధి యోజక ఖాతాలు తెరిచి వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేశారు.

జామై ఉస్మానియా పోస్టాఫీసు వద్ద సుకన్య సమృద్ధి ఖాతా పుస్తకాలతో బాలికలు, వారి తల్లిదండ్రులు, యూపీఎస్సీ ర్యాంకర్లు, భారతీయ తపాలాశాఖ అధికారులు

ఐఆర్ఎస్ అధికారులు నరసింహారెడ్డి, అనురాగ్‌సింగ్, ఐఆర్ఏఎస్ అధికారి రాంరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై సుకన్య ఖాతాలతో పాటు బాలికల తల్లిదండ్రులు, సంరక్షకులకు ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ డిజిటల్ అకౌంట్లనూ తెరిచారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ జనరల్ శ్రీలత మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజనా ఖాతాలను కేంద్రప్రభుత్వం 2015లో భేటీ బచావో, భేటీ పడావో నినాదంలో భాగంగా బాలికల భవిష్యత్ కోసం ఈ పథకాన్ని ప్రారంభించిందన్నారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 3,89,24,105 ఖాతాలను తెరిచారని వివరించారు. అందులో కేవలం పోస్టాఫీస్‌ల ద్వారానే 3,24,66,947 ఖాతాలు తెరిచారని, రాష్ట్రంలో 10,54,062 ఖాతాలు తెరిచారని చెప్పారు. ఈ పథకంతో దేశంలో చాలా వరకు భ్రూణ హత్యలు తగ్గాయని పేర్కొన్నారు. ఎంతోమంది యువతులు వారి పెళ్లిళ్లు, చదువులకు సకాలంలో డబ్బును ఉపయోగించుకున్నారని తెలిపారు. ప్రతి ఆడపిల్ల ఆర్థిక స్వావలంబనకు ఈ పథకం ఉపకరిస్తుందని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత తపాలాశాఖ అధికారులు పాల్గొన్నారు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ ఏర్పాట్లపై 25న సమావేశం

సమావేశానికి రావాలని ఎమ్మెల్యే తలసానికి లేఖను అందజేస్తున్న సాయిగౌడ్

అమీర్‌పేట్, జూన్ 22 : జూలై 8 నుంచి మూడు రోజుల పాటు జరిగే బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి కల్యాణోత్సవ ఏర్పాట్లపై 25న దేవాలయ ఆవరణలో సమీక్షా సమావేశం జరుగనుంది. ఈ సమావేశానికి హాజరు కావాలని కోరుతూ ఎల్లమ్మ దేవాలయ కమిటీ చైర్మన్ కొత్తపల్లి సాయిగౌడ్ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు ఆహ్వాన పత్రికను అందజేశారు. వేడుకలను విజయవంతం చేయడంలో రాజకీయాలకు అతీతంగా అంతా ఐక్యంగా పని చేయాలని తలసాని పిలుపునిచ్చారు. మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి తదితరులు పాల్గొన్నారు.

గాంధీకాలనీలో జిమ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీగణేశ్

మారేడ్‌పల్లి, జూన్ 22: కంటోన్మెంట్ నాలుగో వార్డు గాంధీకాలనీలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన జిమ్ సెంటర్‌ను ఎమ్మెల్యే శ్రీ గణేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోజూ వ్యాయామం చేయడం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారన్నారు. పిల్లలతోపాటు పెద్దలు కూడా వ్యాయామం చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌ను బస్తీ వాసులు శాలువాతో సత్కరించారు. కాంగ్రెస్ నాయకుడు ఎస్.వెంకటేశ్, బస్తీ వాసులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గాంధీ కాలనీలో ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన జిమ్‌ను ప్రారంభిస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్

ఓయూలో యోగా దినోత్సవం

వాక్‌లో పాల్గొన్న ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ సిబ్బంది

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శనివారం ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ - సదరన్ రీజనల్ సెంటర్ (ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ)లో ఘనంగా జరుపుకున్నారు. సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ బి. సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి వాక్ నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ సుధాకర్‌రెడ్డి శిక్షకుడిగా మారి, సిబ్బందితో యోగా చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సానుకూల దృక్పథంతో ముందుకువెళ్లాలన్నారు. నిరాశా నిస్పృహలను దరిచేరనీయకూడదని, యోగా అభ్యసించడంతో మనసు, శరీరం ఆరోగ్యంగా ఉంటాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ జాకబ్ కళ్లె, సెంటర్ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో..

బేగంపేట్ : అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో యోగా డే నిర్వహించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ ఇన్నయ్య, ఫాదర్ ఆంటోని, ఎన్‌సీసీ ఆఫీసర్ జైపాల్‌తోపాటు క్యాడెట్స్ యోగా చేశారు. యోగా శిక్షకురాలు శివజ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం

అన్నదానం చేస్తున్న ముప్పిడి మధుకర్, తదితరులు

బొల్లారం,జూన్ 22: కంటోన్మెంట్ ఒకటో వార్డు బోయిన్‌పల్లి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవ వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సాయికిశోర్, టింకుగౌడ్, కుమార్, సరస్వతి, ప్రేమ్‌కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సీజీఎస్టీ సూపరింటెండెంట్ సదానందంకు సత్కారం

బేగంపేట్ జూన్ 22: సీజీఎస్టీ హైదరాబాద్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందిన సదానందంను సహోద్యోగులు ఘనంగా సత్కరించారు. శనివారం సికింద్రాబాద్‌లోని సోలిటైర్ హోటల్‌లో కస్టమ్స్ అండ్ సీజీఎస్టీ, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మాన సభ నిర్వహించారు. సదానందం అంకితాభావంతో విధులు నిర్వహించారని పలువురు కొనియాడారు. ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా ఉద్యోగులు, సిబ్బంది సంక్షేమం కోసం పోరాడారని అన్నారు. విధుల నిర్వహణలో తనకు సహకరించిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు

డంపింగ్ యార్డు తొలగింపునకు కృషి..

తిరుమలగిరిలో డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

బొల్లారం,జూన్ 22:కంటోన్మెంట్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తానని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు.శనివారం ఏడో వార్డు పరిధిలోని తిరుమలగిరి గాంధీ కమ్యూనిటీహాల్ సమీపంలోని డంపింగ్ యార్డును స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వార్డు ప్రజల సౌకర్యార్థం కమ్యూనిటీ హాల్ సమీపంలో ఉన్న డంపింగ్ యార్డును తొలగించి మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నాగినేణి సరిత, రేమండ్, రాకేశ్, ఆంథోని, భవాని,శ్యామ్సన్ పాల్గొన్నారు.

డబుల్ ఇండ్ల నిర్మాణ పనుల పరిశీలన

కంటోన్మెంట్ రెండో వార్డు పరిధిలోని కట్టమైసమ్మ క్రిష్ణానగర్‌లోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల నిర్మాణాలను శనివారం ఎమ్మెల్యే శ్రీగణేశ్ పరిశీలించారు. ఇండ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అంజనేయులు,శ్రీనివాస్, ముప్పిడి గోపాల్, శ్యామ్‌సన్ రాజు, బాల్‌రాజు, మల్లేశం పాల్గొన్నారు.

'మాటల చెట్టు' పుస్తకావిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రచయితల సంఘం జంటనగరాల ఆధ్వర్యంలో శనివారం రవీంద్రభారతిలో రచయిత్రి గడ్డం సులోచన రచించిన 'మాటల చెట్టు' పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ చైర్మన్ నందిని సిధారెడ్డి విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. గడ్డం సరోజిని, రంగారెడ్డి, డాక్టర్ నారాయణ, సంపత్‌కుమార్, శ్రీరాములు పాల్గొన్నారు. - రవీంద్రభారతి

మహంకాళి బోనాలను విజయవంతం చేయాలి

- అధికారుల సమన్వయ సమావేశంలో డీసీపీ సాధనరష్మీ

సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీ సాధన రష్మీ పెరుమాళ్

బేగంపేట్ జూన్ 22: ప్రతిష్ఠాత్మక సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతరను అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని ఉత్తర మండలం డీసీపీ సాధన రష్మీ పెరుమాళ్ సూచించారు. శనివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయ ప్రాంగణంలో జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ, పోలీస్, దేవదాయశాఖ, వైద్యారోగ్య, అగ్నిమాపక శాఖల అధికారులతో కలిసి సమన్వయ సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు చేపట్టాల్సిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి నుంచే పనులు ప్రారంభించి ముందుకెళ్లాలని సూచించారు. లక్షలాది మంది భక్తులు భద్రతతో పాటు వారు అమ్మవారిని దర్శించుకునేలా చూడాలన్నారు. అందుకే పోలీస్ శాఖకు అందరు సహకరించాలని ఆమె కోరారు. అంబులెన్స్‌లు, అగ్నిమాపకశాఖ యంత్రాలు రాకపోకలు సాగించేలా బారికేడ్ల మధ్యలో అత్యవరసర ద్వారాలు ఏర్పాటు చేయాలని అదేశించారు. వలంటీర్లకు తగిన శిక్షణ అందించాలని చెప్పారు. ట్రాఫిక్ అవాంతరాలు లేకుండా వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో దేవాలయ ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, అదనపు డీసీపీ అశోక్, గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య, జడ్సీ రవికిరణ్, డీఎంహెచ్‌వో డాక్టర్ వెంకటి, మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురాం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు తల్లిదండ్రుల విలువను తెలుసుకోవాలి

ల్యాప్‌టాప్‌లో గేయాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: ప్రతి ఒక్కరూ తల్లిదండ్రుల విలువను తెలుసుకోవాలని దక్షిణ భారత రాజకీయ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. దాసర్ల శ్రీశైలం రచించిన 'అమ్మ లేనిదే జన్మ లేదురా' అనే పాటను ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో త్యాగాలు చేసి పిల్లలను ఉన్నతులుగా తీర్చిదిద్దుతారని పేర్కొన్నారు. ప్రస్తుత సమాజంలో మానవత్వం లేకుండా అమ్మనాన్నలను ఇంటి నుంచి గెంటివేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి వారు ఈ పాటను తప్పక వినాలని సూచించారు. తన శిష్యుడు, దాసర్ల శ్రీశైలం ఈ గేయాన్ని రాయడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. గౌతమి ఫిలిం మేకర్స్ బ్యానర్‌పై రూపొందించిన ఈ పాటను జగదీశ్ దుగాణ ఆలపించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు మన అశోక్‌యాదవ్, రాంబాబు, పురం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

పలు కోర్సుల్లో బ్యాక్‌లాగ్స్ రాసేందుకు వన్‌టైమ్ ఛాన్స్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సులు పూర్తి చేసి బ్యాక్‌లాగ్ సబ్జెక్టులు మిగిలిన విద్యార్థులకు వన్‌టైమ్ చాన్స్ కల్పించినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ, ఎంఈడీ, బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో బ్యాక్‌లాగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థులకు ఈ అవకాశం కల్పించినట్లే పేర్కొన్నారు. అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును వచ్చే నెల 10లోగా , రూ. 300 అపరాధ రుసుముతో 12 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని సూచించారు. అన్ని కోర్సుల పరీక్షలకు సాధారణ పరీక్ష ఫీజుతోపాటు పెనాల్టీ చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న సిలబస్, పరీక్షా విధానంలోనే అభ్యర్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. పరీక్షలను ఆగస్టులో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను త్వరలోనే ప్రకటిస్తామని, ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు.

ఎంఈ, ఎంటెక్ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ పరీక్షలకు సంబంధించి రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లే పేర్కొన్నారు. ఫలితాలను www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

వివిధ కోర్సుల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షల ఫలితాలకు సంబంధించి రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులు కోరుతున్నట్లు ఓయూ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. బీఫార్మసీ (పీసీఐ) అన్ని సెమిస్టర్ల మెయిన్, బ్యాక్‌లాగ్, పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్కుల మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవచ్చని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి, ఈనెల 29 లోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే 1 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు www.osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

లాలాగూడ సీఐగా కరుణాకర్‌రెడ్డి

సీఐ కరుణాకర్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 22: లాలాగూడ పోలీస్‌స్టేషన్ స్టేషన్ హౌజ్ ఆఫీసర్‌గా పైళ్ల కరుణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. శనివారం ఆయన స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సీఐకి పలువురు పోలీస్ అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

బోయిన్‌పల్లి మార్కెట్‌లో నేడు అన్నదానం

మారేడ్‌పల్లి, జూన్ 22: బోయిన్‌పల్లి మార్కెట్ కార్మికులు,వర్తక సంఘం మాజీ అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ జ్ఞాపకార్థం ఆయన సోదరుడు తలసాని నర్సింగ్ యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 11:30 గంటలకు మార్కెట్ ఆవరణలో అన్నదానం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి నివేదిత, తదితరులు హాజరు కానున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు సన్మానం

బొల్లారం,జూన్ 22: రిసాల బజార్ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న సునీల్‌కుమార్ పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఇటీవల కార్ఖానా ప్రభుత్వ పాఠశాలకు బదిలీపై వెళ్లిన సునీల్‌కుమార్ గత 15 ఏండ్లుగా రిసాలబజార్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా సేవలందించారు. దాతల సహకారంతో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పించడంలో విశేష కృషి చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది సునీల్‌కుమార్‌ను శాలువాతో సత్కరించారు. విధుల నిర్వహణలో తనకు సహకరించిన వారికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.